పాటల పల్లకిలో దేవర

ఎన్టీఆర్ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'దేవర' నిర్మాణం నుంచే ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతున్నది. రెండు భాగాలుగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. 'దేవర పార్ట్-1' సెప్టెంబర్ 27న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ చిత్రంలో జాన్వీకపూర్ కథానాయికగా నటిస్తుండగా, సైఫ్‌అలీఖాన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమాకు సంబంధించిన తాజా అప్‌డేట్ వెలువడింది. మ్యూజికల్ ప్రమోషన్స్‌లో భాగంగా రెండో గీతాన్ని ఈ నెల 5న విడుదల చేయబోతున్నారు. శుక్రవారం ఈ పాట తాలూకు పోస్టర్‌ను రిలీజ్ చేశారు. అనిరుధ్ సంగీతాన్నందిస్తున్న ఈ పాట రొమాంటిక్ మెలోడీగా ఆకట్టుకుంటుందని, ఎన్టీఆర్ నృత్యాలు, జాన్వీకపూర్ అందచందాలు ప్రధానాకర్షణగా నిలుస్తాయని మేకర్స్ తెలిపారు. ఎన్టీఆర్ ఆర్ట్స్, యువ సుధ ఆర్ట్స్ పతాకాలపై సుధాకర్, హరికృష్ణ కె. ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

గట్టుదాటి గుండె కొట్టుకున్నదే..

రవితేజ కథానాయకుడిగా హరీష్‌శంకర్ దర్శకత్వంలో రూపొందిన తాజా చిత్రం 'మిస్టర్ బచ్చన్' ఈ నెల 15న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలేర్పడ్డాయి. రిలీజ్ తేదీ దగ్గరపడుతుండటంతో ప్రచార పర్వంలో జోరు పెంచారు. శుక్రవారం మూడోగీతం 'జిక్కి..' విడుదలైంది. మెలోడీ ప్రధానంగా స్వరకర్త మిక్కీ జే మేయర్ ఈ పాటను తీర్చిదిద్దారు. అటు కాశ్మీర్ అందాలూ, ఇటు నాయకా నాయికల కెమిస్ట్రీ రెండూ ఆకట్టుకునేలా ఉన్నాయి. 'నిన్ను చూసి గుండె ఒట్టు పెట్టుకున్నదే.. గట్టు దాటి గట్టిగానే కొట్టుకున్నదే.. పట్టు బట్టి పూల చేయి పట్టుకున్నదే.. అగ్గిరాజేశాక ఆగేదెట్లాగే..' అంటూ చక్కటి ప్రణయభావాలతో ఈ పాట సాగింది. వనమాలి రాసిన ఈ పాటను కార్తీక్, రమ్య బెహరా ఆలపించారు. ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నామని మేకర్స్ ప్రకటించారు. భాగ్యశ్రీబోర్సే, జగపతిబాబు, సచిన్‌ఖేడేకర్, సత్య తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జే మేయర్, నిర్మాత: టీజీ విశ్వప్రసాద్, రచన-దర్శకత్వం: హరీశ్‌శంకర్.

పొయెటిక్ ఎంటర్‌టైనర్

విజయ్ ఆంటోనీ నటించిన పొయెటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'తుఫాన్'. విజయ్ మిల్టన్ దర్శకుడు. కమల్ బోరా, డి.లలితా, బి.ప్రదీప్, పంకజ్ బోరా నిర్మాతలు. ఈ నెల 9న సినిమా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా విడుదల చేసిన ప్రచార చిత్రాలకు అద్భుతమైన స్పందన వస్తున్నదని, ప్రేక్షకులకు 'తుఫాన్' సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వబోతున్నదని మేకర్స్ చెబుతున్నారు. శరత్‌కుమార్, సత్యరాజ్, డాలీ ధనుంజయ, మేఘా ఆకాశ్, మురళీశర్మ, తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి మాటలు: భాష్యశ్రీ, సంగీతం: అచ్చు రాజమణి, విజయ్ ఆంటోని.

విధి ఎదురుచూపులో

తక్కువ టైమ్‌లోనే పాన్‌ఇండియా స్టార్‌గా ఎదిగారు విజయ్ దేవరకొండ. సక్సెస్, ఫెయిల్యూర్లతో నిమిత్తం లేని మార్కెట్ ఆయనది. సినిమా విజయం సాధిస్తే.. ఆ వసూళ్లు టాప్‌గ్రేడ్ హీరోలకు ఏ మాత్రం తీసిపోవు. అదీ విజయ్ ఇమేజ్. ప్రస్తుతం ఆయన చేస్తున్న సినిమాకు వర్కింగ్ టైటిల్ 'వీడీ 12'. గౌతమ్ తన్ననూరి దర్శకుడు. ఇంటెన్స్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ శ్రీలంకలోని పలు సుందరమైన ప్రదేశాల్లో జరిగింది. ఇప్పటివరకూ 60శాతం చిత్రీకరణ పూర్తయింది. వచ్చే ఏడాది మార్చి 28న సినిమాను విడుదల చేయనున్నట్టు నిర్మాతలు సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య తెలిపారు. 'హిజ్ డెస్టినీ అవెయిట్స్ హిమ్' అంటూ ఈ సినిమా పోస్టర్‌ను తన సోషల్‌మీడియా ఖాతాల్లో షేర్ చేశారు విజయ్ దేవరకొండ. ఈ సినిమా టైటిల్, ఫస్ట్‌లుక్‌ని ఈ నెలలోనే విడుదల చేయనున్నారు. ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్ రవిచందర్.

వయనాడ్ బాధితులకు అండగా..

ఇటీవల కేరళలోని వయనాడ్‌లో సంభవించిన వరదల్లో వందలాది మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఆస్తి నష్టం కూడా భారీగానే జరిగింది. ఈ నేపథ్యంలో వయనాడ్ బాధితులకు అండగా కేరళ ప్రభుత్వ సహాయనిధికి 5లక్షల విరాళాన్ని అందజేసినట్లు సితార ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ప్రకటించింది. 'లక్కీ భాస్కర్' టీమ్ తరపున ఈ విరాళాన్ని అందిచినట్లు పేర్కొంది.

తమిళంలో బంపరాఫర్

మలయాళం, తమిళ భాషల్లో ప్రతిభావంతురాలైన కథానాయికగా పేరు తెచ్చుకుంది మాళవిక మోహనన్. ప్రస్తుతం ఈ భామ తెలుగులో ప్రభాస్ సరసన 'రాజాసాబ్' చిత్రంలో నటిస్తున్నది. తాజాగా ఆమె తమిళంలో కార్తీ సరసన కథానాయికగా నటించే బంపరాఫర్‌ను దక్కించుకుంది. వివరాల్లోకి వెళితే.. కార్తీ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'సర్దార్-2' ఇటీవలే ప్రారంభమైంది. పీఎస్ మిత్రన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ చెన్నైలో జరుగుతున్నది. ఈ సినిమాలో మాళవిక మోహనన్ కథానాయికగా ఖరారైంది. ఈ విషయాన్ని శుక్రవారం మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నామని, కథాగమనంలో మాళవిక మోహనన్ పాత్రకు చాలా ప్రాధాన్యత ఉంటుందని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: యువన్‌శంకర్ రాజా, నిర్మాత: ఎస్.లక్ష్మణ్ కుమార్.

ఇది సాంకేతిక విజయం

'సినిమా చూసిన ప్రతి ఒక్కరూ మెచ్చుకుంటున్నారు. ఇది సాంకేతిక విజయం. ఇలాంటి కొత్త కాన్సెప్ట్ నాకు ఇచ్చిన దర్శకుడు అప్సర్‌కి థ్యాంక్స్ చెప్పుకుంటున్నా' అని అశ్విన్‌బాబు అన్నారు. ఆయన హీరోగా అప్సర్ దర్శకత్వంలో మహేశ్వర రెడ్డి నిర్మించిన చిత్రం 'శివంభజే'. ఇటీవలే విడుదలైన ఈ చిత్రం సక్సెస్‌మీట్‌ని హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అశ్విన్ బాబు మాట్లాడారు. టెక్నీషియన్స్ అందరూ ప్రాణంపెట్టి చేయడం వల్లే ఈ విజయం సాధ్యమైందని దర్శకుడు చెప్పారు. హీరో అశ్విన్, నిర్మాత మహేశ్వరరెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా చిత్ర యూనిట్ సభ్యులందరూ మాట్లాడారు.

తరుణ్‌భాస్కర్ విడాకుల స్టాంప్‌పేపర్

మల్టీ టాలెంటెడ్ తరుణ్‌భాస్కర్ ప్రధాన పాత్రలో ఓ చిత్రం రూపొందనుంది. వంశీ రెడ్డి దొండపాటి దర్శకుడు. బూసం జగన్మోహన్‌రెడ్డి నిర్మాత. ఈ సినిమాకు సంబంధించిన ప్రకటన శుక్రవారం వెలువడింది. శ్రీనివాస్‌గౌడ్ అనే వ్యక్తి.. అతని భార్య శ్రీలత నుంచి విడాకులు తీసుకున్నట్టు సూచించే ఓ స్టాంప్ పేపర్‌తో విభిన్నంగా ఈ సినిమాను మేకర్స్ అనౌన్స్ చేశారు. రచయిత, దర్శకుడు వేణు ఊడుగుల ఈ సినిమా స్క్రిప్ట్‌లో భాగమయ్యారు. వినోదంతో పాటు హత్తుకునే భావోద్వేగాలతో కూడిన కథాంశంతో ఈ సినిమా రూపొందనున్నదని, అక్టోబర్‌లో షూటింగ్ మొదలయ్యే ఈ సినిమా కోసం కొత్త వారిని పరిచయం చేయాలనుకుంటున్నామని మేకర్స్ తెలిపారు. యారో సినిమాస్, డోలాముఖి సబ్‌బల్బ్రాన్ ఫిల్మ్స్ పతాకాలపై ఈ చిత్రం రూపొందనుంది.

రాత్రికి రాత్రి నర్సుల బదిలీల్లో మార్పులు

- వారంక్రితం పోస్టింగ్‌ల రద్దు
- రాత్రికి రాత్రే బదిలీ
- కొందరికి మాత్రమే స్థానచలనంపై అనుమానాలు
- లక్షల రూపాయలు చేతులు మారినట్టు ఆరోపణలు

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ): నర్సింగ్ అధికారుల బదిలీలపై వివాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. బదిలీల్లో భాగంగా కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్ ఇచ్చిన అధికారులు గురువారం రాత్రి మాడిఫై పేరిట మళ్లీ ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారని గ్రేడ్-2 నర్సులు పేర్కొన్నారు. తొలుత ఫోకల్ టు ఫోకల్ కింద కౌన్సెలింగ్ నిర్వహించి హైదరాబాద్‌లోని ఆయా దవాఖానల్లో వీరికి పోస్టింగ్‌లు ఇచ్చారు. దీంతో వారంతా వారం రోజుల క్రితమే కొత్తగా కేటాయించిన పోస్టింగ్‌లలో చేరిపోయారు. కానీ వారిని గురువారం రాత్రి దూరప్రాంతాల్లో ఉన్న జిల్లాలకు బదిలీ చేశారు. ఇలా కొంతమందిని మాత్రమే మాడిఫై కింద బదిలీ చేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వారం గడవక ముందే ఏ నిబంధనల ప్రకారం రెండోసారి తమను బదిలీ చేశారని వారు ప్రశ్నిస్తున్నారు. నిబంధనలు ఉంటే అందరికీ సమానంగా ఉంటాయని, ఈ బదిలీల్లో డబ్బులు ఇచ్చినవారికి కోరుకున్న చోట పోస్టింగ్‌లు కల్పించడం, ఇవ్వని వారికి ఇచ్చిన పోస్టింగ్‌లు క్యాన్సల్ చేసి, దూర ప్రాంతాలకు బదిలీ చేయడం దారణమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వీరిపై ఎందుకంత ప్రేమ....?

నర్సింగ్ సిబ్బంది బదిలీల్లో లక్షల రూపాయలు చేతులు మారాయని, అందువల్లనే దగ్గర ఇచ్చిన పోస్టింగ్‌లు దూరమయ్యాయని, దూరమిచ్చిన పోస్టింగ్‌లు దగ్గరయ్యాయని పలువురు నర్సింగ్ సిబ్బంది ఆరోపిస్తున్నారు. ఉస్మానియా దవాఖానలో నర్సింగ్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న సుజాత రాథోడ్‌కు కౌన్సెలింగ్ ద్వారా సూర్యాపేట ప్రభుత్వ దవాఖానలో పోస్టింగ్ కల్పించిన అధికారులు వారం తిరగకుండానే ఆమెకు నగరంలోని పేట్ల బుర్జ్ ప్రసూతి దవాఖానలో పోస్టింగ్ ఎలా కల్పించారని ప్రశ్నించారు. గాంధీలో నర్సింగ్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న మంగమ్మను మహబూబ్‌నగర్‌కు బదిలీ చేసిన అధికారులు వారంలోపే ఆమెకు తిరిగి ఉస్మానియా దవాఖానలో పోస్టింగ్ కల్పించడం, ఉస్మానియాలో హెడ్ నర్స్‌గా విధులు నిర్వర్తిస్తున్న శిరీషకు గాంధీ దవాఖానలో పోస్టింగ్ కల్పించడంలో ఏ నిబంధనలు పాటించారని వారు ప్రశ్నిస్తున్నారు.

ఇండ్లలోకి చొరబడి చంపుతున్నాయ్

- వీధికుక్కల నియంత్రణకు పటిష్ఠ చర్యలు చేపట్టాల్సిందే
- రాష్ట్ర ప్రభుత్వానికి, జీహెచ్‌ఎంసీకి తేల్చిచెప్పిన హైకోర్టు

హైదరాబాద్, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో వీధికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. జనాన్ని వెంబడించి కాటు వేయడంతోపాటు ఏకంగా ఇండ్లలోకి చొరబడి దాడి చేస్తున్నాయి. దీంతో ఇటీవల 14 మంది గాయపడటంతోపాటు ఓ వృద్ధురాలు (82) మరణించింది. ఈ ఘటనలపై హైకోర్టు తీవ్ర స్థాయిలో స్పందించింది. వీధికుక్కలను నియంత్రించేందుకు జంతు సంక్షేమ సంస్థల ప్రతినిధులు, పశువైద్యులతో చర్చించి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వానికి, జీహెచ్‌ఎంసీ అధికారులకు స్పష్టం చేసింది. సమావేశాలు, సూచనలతో సరిపెట్టడానికి వీల్లేదని, సమగ్ర కార్యాచరణను అమలు చేయాలని తేల్చిచెప్పింది. వీధికుక్కలను పట్టుకునేందుకు 24 గంటలూ అందుబాటులో ఉండేలా వాహనాల ఏర్పాటు తోపాటు కుక్కకాటు బాధితుల కోసం హెల్ప్‌లైన్‌ను, ఫిర్యాదుల స్వీకరణకు ఓ యాప్‌ను అందుబాటులోకి తేవాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం ఆదేశించింది. వీధికుక్కలకు ఆహారం లేక జనంపై దాడి చేస్తున్నాయంటూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంతోపాటు వాటి దాడుల వల్ల ఇటీవల బాగ్ అంబర్‌పేటలో ఓ విద్యార్థి, పటాన్‌చెరులో ఓ కార్మికుడి కుమారుడు మృతి ఘటనలపై విచారణను సెప్టెంబర్ 2కి వాయిదా వేశారు.

12 గంటలపాటు కొనసాగిన ఏసీబీ తనిఖీలు

కందిలోని రిజిస్ట్రేషన్ కార్యాలయం నుంచి 56 డాక్యుమెంట్లు తీసుకెళ్లిన అధికారులు

సంగారెడ్డి జిల్లా కందిలోని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం వరకు తెరుచుకోని కౌంటర్లు

కంది, ఆగస్టు 2: సంగారెడ్డి జిల్లా కందిలోని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు ఆకస్మిక సోదాలు నిర్వహించారు. గురువారం సాయంత్రం 6 నుంచి శుక్రవారం ఉదయం 6 వరకు సుమారు 12 గంటలపాటు సోదాలు చేపట్టారు. రిజిస్ట్రేషన్ కార్యాలయ అధికారులు, ఉద్యోగులను ఉదయం 6 గంటల వరకు బయటకు వెళ్లనీయకుండా విచారణ చేపట్టారు. భూ రిజిస్ట్రేషన్లకు సంబంధించి ఏమైనా అవకతవకలు జరిగా యా? అన్న కోణంలో దర్యాప్తు చేసేందుకు గురువారం జరిగిన 56 రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను తీసుకెళ్లారు. ఇవే కాకుండా కొద్దిరోజులుగా జరిగిన రిజిస్ట్రేషన్ల డాటా తీసుకెళ్లినట్టు సమాచారం. ఏసీబీ అధికారులు రావడాన్ని గమనించి కిటికీలోంచి రూ.లక్ష బయట పడేయడంతో ఆ నగదును స్వాధీనం చేసుకొన్న అధికారులు, డబ్బులు విసిరేసింది ఎవరన్న కోణంలో విచారణ జరుపుతున్నారు. అనుమానం ఉన్న పలు పత్రాలను తీసుకెళ్లారు. సోదాలకు సంబంధించి ఎలాంటి రిపోర్టును ఏసీబీ అధికారులు ప్రకటించలేదు. కాగా, ఏసీబీ తనిఖీలకు భయపడి ఉద్యోగులు విధులకు హాజరుకాకపోవడం చర్చనీయాంశగా మారింది. శుక్రవారం మధ్యా హ్నం 12.30 గంటల వరకు కూడా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఉన్న ఏ ఒక్క కౌంటర్ తెరుచుకోలేదు. రిజిస్ట్రేషన్లు జరగవనే ప్రచారం జరిగింది. కందిలోని జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో డాక్యుమెంట్ రైటర్లే కీలకంగా వ్యవహరిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. డాక్యుమెంట్‌ను బట్టి బేరసారాలు నడుస్తున్నట్టు సమాచారం. ఈ క్రమంలో ఏసీబీ అధికారులు డాక్యుమెంట్ రైటర్లపై ప్రత్యేక నిఘా పెట్టినట్టు తెలుస్తున్నది. డాక్యుమెంట్ రైటర్ల షాపులు కూడా మూసిఉండటంతో రిజిస్ట్రేషన్ ఆఫీసు జనాల్లేక వెలవెలబోయింది.

పర్వతగిరి ఎస్సై వెంకన్న, డ్రైవర్ సదానందం

ఏసీబీకి చిక్కిన పర్వతగిరి ఎస్సై

- 40 వేలు తీసుకుంటూ దొరికిన వెంకన్న
- డ్రైవర్ సదానందం కూడా..

పర్వతగిరి, ఆగస్టు 2: వరంగల్ జిల్లా పర్వతగిరి ఎస్సై గుగులోత్ వెంకన్న, డ్రైవర్ సదానందం లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కారు. పర్వతగిరి మండలం అన్నారం శివారు పెద్ద తండా గ్రామానికి చెందిన బెల్లం వ్యాపారి ధరావత్ భాస్కర్‌కు ఓ క్రిమినల్ కేసులో స్టేషన్ బెయిల్ ఇవ్వడానికి ఎస్సై రూ. 70 వేల లంచం డిమాండ్ చేశాడు. ఈ క్రమంలో భాస్కర్ ఏసీబీ అధికారులకు సమాచార మందించాడు. అంతకుముందే వేరే వ్యక్తి ద్వారా రూ. 20 వేలు ఫోన్ పే ద్వారా తీసుకున్నారు. శుక్రవారం రూ. 40 వేలు లంచం తీసుకుంటుండగా ఎస్సై వెంకన్నతోపాటు డ్రైవర్ సదానందంను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్టు ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపారు.



Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.